క్లుప్తంగా

పౌరసరఫరాల గోదాము తనిఖీ



రేషన్ నిల్వలపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పట్టణంలోని పౌరసరఫరాల గోదాం పాయింట్‌ను శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న రేషన్ నిల్వలు, రికార్డుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సమయానికి రేషన్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఉప తహసీల్దార్ రవీంద్రరెడ్డి, పౌర సరఫరాల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యూరియా ఇప్పించు గణపయ్యా!



గణేషుడికి వినతి పత్రాన్ని ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కౌతాళం: ఓ బొజ్జగణపయ్య రైతులకు యూరియా అందివయ్యా, తెలుగుదేశం నేతల మనస్సు మార్చి, అధికారుల మనసు మార్చి యూరియాను తెప్పించడానికి కృషి చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం నాయకులు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి మల్లయ్య ఆధ్వర్యంలో కౌతాళంలో గణేష్ మండపానికి వెళ్లి గణనాడికి రైతుల కష్టాలు తెలుపుతూ కౌతాళం మండలానికి 2వేల టన్నుల యూరియా వచ్చేలా దీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, నాగరాజు, ఈరన్న, మారుతి, పరుష, హనుమంతు, శ్రీను పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పనిముట్లు

పెద్దకడబూరు : ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ యోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న కార్పెంటర్ పనిముట్లు పోస్టుద్వారా నేరుగా లబ్ధిదారులకే అందినట్లు విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు నరసింహాచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన వినోద్‌కుమార్ ఆచారి, శ్రీకాంత్ ఆచారి, నరసింహాచారి, ఈరన్నాచారి, వీరప్పాచారి, గురుఆచారి, పెద్ద రంగస్వామాచారి నమోదు చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు అందరికి పోస్టుద్వారా కిట్లు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలో శ్రీశైల అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి శుక్రవారం జారీ పడ్డాడు. గుల్బర్గా నుంచి బెంగళూరుకు ప్రయాణం చేస్తున్న శ్రీశైల కుప్పగల్లు–ఇస్వీ స్టేషన్ల మధ్య కిలో మీటరు నంబర్ 504/19-21 వద్ద రైలు నుంచి జారీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పడి ఉన్న శ్రీశైలను ఇస్వీ స్టేషన్లో పని చేయుచున్న కీమ్యాన్ లక్ష్మీ రెడ్డి గుర్తించి 108కు ఫోన్ చేసి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య తెలిపారు. ప్రస్తుతం గాయపడిన వ్యక్తి ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డును బట్టి వారి బంధువులకు సమాచారం అందించినట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం : బతుకుదెరువు కోసం కర్ణాటక నుంచి వచ్చిన ఓ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శివమొగ్గకు చెందిన రవి(45)అనే వ్యక్తి మంత్రాలయంలోని న్యూ శ్రీనివాసభవన్ హోటల్‌లో కొన్ని రోజులుగా స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. ఏకష్టం వచ్చిందో తెలియదు కానీ అదే హోటల్‌లోని టాయిలెట్ గదిలో టవల్‌తో ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. గమనించిన హోటల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ శివాంజల్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకు న్‌బాను అన్నారు. శుక్రవారం పట్టణంలోని షరీఫ్‌బజార్ హెల్త్ సెంటర్ పరిధిలోని వెంకన్నపేటలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురాజు, డీపీఎం జ్ఞానేశ్వర్, సీతారాముడు, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

వినాయక..సెలవిక.!



ఎమ్మిగనూరులో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథుడు



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



గోనెగండ్లలో నిమజ్జనానికి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



ఎమ్మిగనూరులో నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి

- ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం
- ఎల్లెల్సీలో విగ్రహాల నిమజ్జనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఎమ్మిగనూరుటౌన్: జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై.. అంటూ ఎమ్మిగనూరు పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. వినాయక ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఎమ్మిగనూరు పట్టణంలో ప్రతిష్టించిన చిన్న, పెద్దసైజు 200లకు పైగా వినాయకులను శుక్రవారం సాయంత్రం నుంచి నిమజ్జనాన్ని ప్రారంభించారు. రాత్రి 12గంటల వరకు నిమజ్జనం కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఎస్పీ భార్గవి పూజలు చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు..భక్తజనుల హర్షధ్వనుల మధ్య వినాయక విగ్రహాల ఊరేగింపు మొదలైంది. సోమప్ప సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్, ఓంశాంతి సర్కిల్, ఆదోని బైపాస్ సర్కిల్ మీదుగా బాణసంచా పేల్చుతూ తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వరకూ సాగింది. కాలువ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్లతో గణనాథులను నిమజ్జనం చేశారు. కాగా, నిమజ్జనం సందర్భంగా స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద వినాయక నిమజ్జనానికి వెళ్లే వారికి ముస్లిం, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మంచినీటి పాకెట్లు అందించి మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో పట్టణ సీఐ శ్రీనివాసులు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

● రూ.1.66లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

పట్టణంలోని తేరుబజారు సందుగుడి వద్ద ఏర్పాటు చేసిన సందుగుడి వినాయక మండలి ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను శుక్రవారం వేలంపాట వేయగా పట్టణానికి చెందిన నందిపైప్స్ డీలర్ పొబ్బాతి నాగరాజు రూ.1,66,666లకు దక్కించుకున్నాడు. వేలంలో పొందిన లడ్డును వినాయక మండలి సభ్యులు నందిపైప్స్ డీలర్ పొబ్బాతి నాగరాజు, శ్రీనివాసులు, నరేంద్ర, వీరేష్‌లకు అందజేశారు.

● ఘనంగా గణనాథుని నిమజ్జనం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో ప్రతిష్టించిన విగ్రహాలను శుక్రవారం నిమజ్జనానికి తీసుకెళ్లారు. గోనెగండ్ల, రాళ్లదొడ్డి, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటేడుదిన్నె, నెరుడుప్పల విగ్రహాలను గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు. అలాగే గంజిహళ్లి, బైలుప్పల బి. అగ్రహారం తదితర గ్రామాల విగ్రహాలను ఎల్లెల్సీ కాలువలో నిమజ్జన చేశారు. సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నందవరం : మండలంలో మూడు రోజుల పాటు విశేష పూజలందుకున్న పార్వతీ పుత్రుడు గణేశుడు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మండలంలోని ముగతి, నందవరం, నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, ఇబ్రహీంపురం, మాచాపురం, హాలహర్వి గ్రామాల్లో వినాయకులను తుంగభద్ర నదిలో నిమజ్జనం కానిచ్చారు. జోహరాపురం గ్రామంలో శ్రీ ఆంజనేయ వినాయక మండలి యువత రూ.4 వేలకు లడ్డూను వేలం ద్వారా దక్కించుకున్నారు. పూజారి అమరేష్ యువతకు లడ్డూను వితరణ గావించారు. ఎస్‌ఐ కేశవ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయం : వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని 3రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడు శుక్రవారం సాయంత్రం తుంగభద్ర నదికి చేరుకున్నారు. మంత్రాలయం మండల కేంద్రంతో పాటు చెట్నిహళ్లి, మాధవరం, కల్లుదేవకుంట, చిలకలడోణ, బూదూరు, సూగూరు, రాంపురం, తుంగభద్ర ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో కొలువుంచి భజనలు, నాట్యాలు, డప్పు దరువుల మధ్య తుంగభద్రనది ఒడ్డుకు చేర్చి నిమజ్జనం చేపట్టారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్‌ఐలు శివాంజల్, విజయకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● కేరింతల నడుమ వినాయకుడికి వీడ్కోలు

పెద్దకడబూరు : మండలంలో శుక్రవారం వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. మండల కేంద్రంతో పాటు చిన్నతుంబళం, బసలదొడ్డి, హెచ్.మురవణి, కంబదహాల్, కల్లుకుంట, కంబలదిన్ని గ్రామాలలో ఉదయం వినాయక లడ్డూలకు వేలం నిర్వహించారు. సాయంత్రం నిమజ్జనంలో భాగంగా పెద్దకడబూరు మండల కేంద్రంలో యువత డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి ఆదోని ప్రధాన రహదారిలో ఉన్న ఎల్ఎల్‌సీలో నిమజ్జనం గావించారు. నిమజ్జనంలో పాల్గొన్న భక్తులకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, శివారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వివిధ ప్రాంతాల్లో వెలసిన గణపయ్యలకు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎల్లమ్మ ఆలయ సమీపంలో కొలువుతీరిన గణనాథుని వద్ద పీఎస్ సుందర్ రాజు దొర ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు పై కొలువుంచి కలశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా కడపాళెం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు వెళ్లారు. మాధవరం సమీపంలో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

● వైభవంగా గణేష్ నిమజ్జనం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుల ఊరేగింపు కార్యక్రమం కొనసాగగా విశ్వహిందు పరిషత్ నాయకుడు మారుతీమోహన్, గ్రామ పెద్దలు ప్రహ్లాదాచారి, వెంకటపతిరాజు, సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రాజనందు, బుజ్జీస్వామిల ఆధ్వర్యంలో గణనాథులకు ప్రత్యేక పూజలను చేయించి నిమజ్జన కార్యక్రమాలకు చేపట్టారు. అనంతరం తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. సీఐ అశోక్‌కుమార్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, అధికారులు పర్యవేక్షించారు.

● ఆదోని మండలంలో..

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలం, కపటి, పెద్దహరివాణం, ఆరేకల్, పెసలబండ, దొడ్డనకేరి, విరుపాపురం, సాదాపురం తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గణనాథులను ట్రాక్టర్లు, ఆటోలలో తరలించి దగ్గరలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.





ఎమ్మిగనూరులోని తుంగభద్రదిగువ కాలువలో క్రేన్‌తో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం, విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ నాయకులు



భక్తులకు అన్నం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

● గణనాథుడికి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టాప్రతుల్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో శాంతి కపోతం ఎగురవేస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి



జొహరాపురంలో రంగులు చల్లుకుంటూ గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు



పెద్దకడబూరు మండలం బాపులదొడ్డి గ్రామంలో రూ.20వేలకు కైవసం చేసుకున్న లడ్డు



పెద్దకడబూరులో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లును పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కౌతాళం ఎల్ఎల్‌సీ కాలువలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



కౌతాళంలో జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు



కోసిగిలో గణనాథుడి ముందు కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, చిన్నారులు



ఆదోని మండలంలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరులో లడ్డును రూ.1.66,666లకు దక్కించుకున్న నందిపైప్స్ డీలర్ నాగరాజు



కౌతాళం మెయిన్ బజారు గుండా గణపయ్యల ఊరేగింపు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఆదోని సెంట్రల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పురపాలక మైదానంలో ఏర్పాటు చేసిన హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ విగ్రహానికి తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, మండల విద్యాధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడా కారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పాఠశాలల క్రీడాకారులతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, నెహ్రూ మెమోరియల్ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, ఫయాజ్ అహ్మద్, రోటరీ క్లబ్ అధ్యక్షులు సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

మా భూములు అప్పగించండి



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మంత్రాలయం : మా భూములు మాకు అప్పగించాలని మంత్రాలయానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు రమాదేవికి శుక్రవారం విన్నవించారు. కొన్నేళ్లుగా తాము సాగుచేస్తున్న భూములను శ్రీమఠం యాజమాన్యం తమకు చెందినవిగా రికార్డులను సృష్టించుకొని రైతులను మోసగించడం సరైన పద్ధతి కాదని, మా వద్ద ఉన్న భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట మీడియా సమావేశంలో రైతులు మాట్లాడారు.. 200ల సంవత్సరాలుగా సర్వేనెంబర్లు 165, 166, 152, 413, 144, 157, 162, 373, 148, 201, 1165లలో దాదాపు 100 ఎకరాల భూమి మంత్రాలయం గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు సంబంధించినదిగా తమవద్ద పురాతన రికార్డులు ఉన్నాయన్నారు. అయినప్పటికీ శ్రీమఠం అధికారులు వారికున్న పలుకుబడితో ఆన్‌లైన్‌లో శ్రీరాఘవేంద్ర స్వామి మఠం అని అనుభవదారుడిగా చూపించడం దారుణమని మండిపడ్డారు. ఈ విషయమై తహసీల్దారుకు పలుమార్లు ఫిర్యాదు చేయగా సంబంధిత రైతులకు, మఠానికి శుక్రవారం విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసినప్పటికీ మఠం అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం.

సంపూర్ణ అక్షరాస్యతకు 'ఉల్లాస్'

గోనెగండ్ల : సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకుగాను ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని వయోజన విద్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో డ్వాక్రా పొదుపు సంఘాల గ్రూపు సభ్యులకు ఉల్లాస్ అక్షరాంధ్ర– అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా గ్రూపులలో 3,840 మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. వీరిలో పది మంది విద్యనేర్చుకునే వారికి బోధకుడిని నియమిస్తారన్నారు. మండలంలో 384 మంది బోధకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనంతసేనా, ఏపీఎం హేమలత, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతాప్, సూపర్‌వైజర్ జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వయోజన విద్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు

దేశ భాషలందు తెలుగు లెస్స



ఎమ్మిగనూరు జెడ్పీ హైస్కూల్‌లో రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరులోని ప్రభుత్వ బాలికల కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయరాణి



నాగలదిన్నెలో జెడ్పీ పాఠశాలలో గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్‌లకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: దేశభాషలందు తెలుగులెస్స అని, మాతృ భాష పరిరక్షణ అందరిబాధ్యత అని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి అన్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎన్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుభాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, ఎస్ఎన్ఎస్ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మల్లారి భీమేష్, ఉపాధ్యాయులు పూల మాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాకీ పితామహుడు, క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బసవరాజు, తిమ్మప్ప, మాదన్న, ఫక్రుద్దీన్, నాగరాజు, ఖాజాబాషా తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె జెడ్పీహెచ్ హైస్కూల్‌లో బాలసాహిత్య వేత్త గద్వాల సోమన్న ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సం, జాతీయ క్రీడ దినోత్సావాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్‌ఎం జాన్సన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు గిడుగు వెంకటరామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 'వేకువ చుక్క' పుస్తకాన్ని హెచ్‌ఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయలు నాగభూషణ్ రెడ్డి, రంగస్వామి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మాధవగౌడ్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయ్యప్ప, డా. రంగనాథం, రామ్ కిషన్, డా. నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ ప్రవీణ్ ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వ్యాపార వేత్త పాడెగల్లు దినేష్ పాఠశాలకు స్పోర్ట్స్ కిట్లును అందించారు. తెలుగు ఉపాధ్యాయులు నిర్మలా మేరి వ్యాయామ ఉపాధ్యాయుడు నరసన్నను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతి, సునంద, మహాదేవి, మారెమ్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్, వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ, లీలాస్ పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల బాలికలకు తెలుగు–వెలుగు అనే అంశంపై రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అవోపా, వామ్ సభ్యులు శ్రీనాథ్‌గుప్తా, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌బాబు, శ్రీనివాసులు, మమత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాళాశాలలో గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూల మాల వేస్తున్న దృశ్యం



ఆదోనిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అవోపా సభ్యులు

సేవాభావం అలవర్చుకోవాలి

నందవరం : ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఎస్‌ఐ కేశవ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లు కోదండ రామిరెడ్డి, నరేంద్రలను ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఇటీవల హెడ్‌కానిస్టేబుల్ కోదండరామిరెడ్డి ఓ విశ్రాంత ఉద్యోగికి హార్ట్ ఎటాక్ రావడంతో సీఆర్‌పీ చేసి ప్రాణాలు కాపాడి ఆసుపత్రికి తరలించాడన్నారు. అలాగే గత నెలలో మహిళ మిస్సింగ్ కేసులో హెడ్ కానిస్టేబుల్ కోందడరామిరెడ్డి, కానిస్టేబుల్ నరేంద్రలు తమిళనాడు వెళ్లి కేసు చేదించి మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారని చెప్పారు.

